సమస్యల్లో సంక్షేమం


నగరి హాస్టల్‌లో నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు


కార్వేటినగరం హాస్టల్‌లో విద్యార్థులకు ఉపయోగపడని మరుగుదొడ్లు

- సంక్షేమ హాస్టళ్లకు సరఫరా కాని నూతన బెడ్‌షీట్లు
- వినియోగంలో లేని మరుగుదొడ్లు
- నీటి సౌకర్యం లేని స్నానపు గదులు, ఆరు బయటే స్నానాలు
- శిథిలావస్థలో కొన్ని భవనాలు
- ఇదీ సంక్షేమ హాస్టళ్ల దుస్థితి

నగరి/కార్వేటినగరం: నగరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లోని హాస్టళ్లలో విద్యార్థులకు మంచాలు, పరుపులు సరఫరా చేయలేదు. దీంతో విద్యార్థులు నేలపై పడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పలు హాస్టళ్లలో విద్యార్థులను దోమల బెడద వేధిస్తోంది. భోజనం మెనూ ప్రకారం పెడుతున్నారు. విజయపురం హాస్టల్లో మాత్రం కొత్త దుప్పట్లు ఇంకా సరఫరా కాలేదు. పాత దుప్పట్లు ఉండడంతో వాటిని వాడుకుంటున్నారు. నూతన భవనం లేకపోవడంతో అద్దె భవనంలోనే హాస్టల్ కొనసాగుతోంది. బాత్‌రూం తలుపులకు కొన్నింటికి కీళ్లు వదులుగా ఉండడంతో వేసుకోవడానికి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

దుర్భర వసతిగృహం

కార్వేటినగరం ఎస్సీ బాలురు వసతిగృహం సమస్యలకు నిలయంగా మారింది. ఇక్కడ చేరేందుకు కూడా విద్యార్థులు ముందుకు రావడం లేదు.


విజయపురంలో బయట కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థులు

గతంలో ఎప్పుడో నిర్మించిన మరుగుదొడ్లు, స్నానపు గదులకు నీటి సౌకర్యం లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో వ్యవసాయ పొలాలే విద్యార్థులకు మరుగుదొడ్లుగా మారాయి. అక్కడకు వెళ్లాలన్నా రోడ్డుదాటుకొని వెళ్లాల్సి ఉండడంతో భయం గుప్పెట్లో విద్యార్థులు రోడ్డు దాటి వెళుతున్నారు. స్నానపు గదుల్లో నీటి సౌకర్యం లేకపోవడంతో ఆరు బయట ఉన్న చేతిపంపు వద్దే స్నానాలు తప్పడం లేదు. దీనికి తోడు మరుగుదొడ్ల నుంచి సంపునకు వెళ్లే పైపులైన్లు పూర్తిగా మరమ్మతులకు గురైనా అధికారులు పట్టించుకోవడం లేదు. సీలింగ్ పలుమార్లు పెచ్చులూడిపోతే సరిచేశారు. పడక గదిలో ఫ్యాన్లు వంకర్లు తిరిగి పనిచేయడం లేదు.

అగమ్యగోచరం

పేదరికంతో అల్లాడుతూ చదువుపై మమకారంతో పొట్ట చేత పట్టుకొని వసతి గృహాల్లో చేరిన చిన్నారుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. విద్యకు ప్రథమ స్థానం ఇవ్వాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. ఈ కారణాలతో గతం కంటే ఈ ఏడాది భారీ స్థాయిలో పిల్లల సంఖ్య తగ్గింది. రెండు నియోజకవర్గాల్లోనూ విద్యార్థులకు హాస్టల్లో తాగునీటికి ఆర్‌ఓ సిస్టం లేదు. దీంతో కొన్ని హాస్టళ్లలో క్యాన్ వాటర్ తెచ్చుకొని వాడుకుంటుండగా కొన్నింటిలో పంచాయతీ వాటర్‌పై ఆధార పడుతున్నారు. ఇదిలా ఉంటే ప్రైవేటు హాస్టళ్ల పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారైంది. గత నెల పన్నూరు ప్రైవేటు హాస్టల్‌కు చెందిన విద్యార్థులు అస్వస్థతకు లోనై ఆస్పత్రిలో చికిత్స పొందిన విషయం విదితమే. హాస్టళ్ల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.


కార్వేటినగరంలో దుస్థితిలో సీలింగ్, ఫ్యాన్


కార్వేటినగరం హాస్టల్‌లో పగిలిన సంపుకెళ్లే పైపు

క్లుప్తంగా

కన్నికలమ్మకు ప్రత్యేక పూజలు


అలంకరణలో కన్నికలమ్మ దేవతలు

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర గ్రామంలోని కనికలమ్మ గ్రామదేవతకు శనివారం గ్రామస్తులు ఘనంగా పూజలు చేశారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు. చెన్నై తాంబరం నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఎంఎస్‌వీఎంపురం సర్పంచ్ మృతి


సుబ్రమణ్యంరాజు(ఫైల్)

నింద్ర: మండలంలోని ఎంఎస్‌మీఎంపురం సర్పంచ్ సుబ్రమణ్యం రాజు(65) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. మృతదేహానికి పలువురు నాయకులు నివాళులర్పించారు. ఎంపీపీ దీప, వైఎస్‌ఆర్ సీపీ మండల కన్వీనర్ వేణురాజు, మండలంలోని సర్పంచ్‌లు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసిన సర్పంచ్ మృతికి గ్రామస్తులు నివాళులర్పించారు.

నేడు అంకాళమ్మ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో అంకాళమ్మ

పుత్తూరు: మండల పరిధిలోని తొరూరు గ్రామంలో వెలసి ఉన్న శ్రీఅంకాళమ్మ దేవస్థాన వార్షిక మహోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నారు. 10 గంటలకు అంబలి ప్రసాదం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. వారికోత్సవాన్ని పురస్కరించుకొని పొంగళ్లు పెట్టడానికి పెద్ద ఎత్తున తరలివచ్చే మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

చెరకు రైతుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న చెరకు రైతు నాయకులు

నింద్ర: మండలంలోని నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ చెరకు రైతుల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని నేతాజీ చెరకు రైతుల సంఘం డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో వారు మట్లాడుతూ గత సంవత్సరం చెరకు రైతులకు ఫ్యాక్టరీ యాజమాన్యం ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వడం లేదని రైతుల సమస్య పరిష్కారం చేయాలని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే కూడా రెండు సార్లు రైతుల సమస్యలను పరిష్కరించాలని తెలిపినా చేయలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి చెరకు రైతుల సమస్య పరిష్కరించాలని కోరారు. సంఘం నాయకులు నారాయణస్వామి రెడ్డి, శ్రీనివాస యాదవ్, గుణ తదితరులు పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో ఆదివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. ఉదయం పది గంటలకు 23వ డివిజన్ జానకారపల్లె అంబేడ్కర్ విగ్రహం వద్ద, తదుపరి 26వ డివిజన్ అంబేడ్కర్‌నగర్ రేణుక అపార్ట్‌మెంట్ వద్ద, 25వ డివిజన్ బొండ్‌వీధిలో మొదటి మరాఠావీధి వద్ద సమావేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి డివిజన్ వాసులు, నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

ఓటర్ల జాబితా సవరణపై కసరత్తు


మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ

గంగాధరనెల్లూరు: రాబోయే నెలలో జరగనున్న ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీలు సిద్ధంగా ఉండాలని నియోజకవర్గ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివ అన్నారు. గంగాధరనెల్లూరు మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో శనివారం డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా రాబోయే నెలలో జరగనున్న ఓటర్ల జాబితాలో సవరణ కార్యక్రమం, నియోజకవర్గంలోని 18 పోలింగ్ కేంద్రాలలో మార్పులు, చేర్పులు జరిగాయని ఏవైనా అభ్యంతరాలు ఉంటే రెండు రోజుల్లోపు తెలియజేయాలన్నారు. 1200 ఓట్లు ఉన్న కేంద్రాలను రెండుగా చేశామన్నారు. నియోజకవర్గంలో ప్రతి బూతుకు ఒక ఏజెంట్‌ను నియమించుకోవాలని రాజకీయ పార్టీలను కోరారు. ఈ కార్యక్రమంలో జీడీ నెల్లూరు తహశీల్దార్ శ్రీనివాసులు, ఎన్నికల డీటీ మహేశ్వరి, వివిధ మండలాల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఏపీ ఓపెన్ స్కూల్‌కు అడ్మిషన్లు ప్రారంభం


ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓలు

నగరి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఏపీ ఓపెన్ స్కూల్ ద్వారా చదువుకోవాలని కోరిక కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం తెలిపారు. దీనిపై అవగాహన కల్పించడానికి ఎమ్మార్సీ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్ వరకు చదివి ఆగిన విద్యార్థులు వారి చదువు కొనసాగించడానికి, గ్రామీణ యువతకు, ఉద్యోగాల్లో ఉండి చదువు కొనసాగించాలనుకునే వారికి, ప్రత్యేక అవసరాలున్న వారికి విద్యనందించడమే ఏపీ ఓపెన్ స్కూల్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఆగస్టు 31 నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండిన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఈ కోర్సు ఏడాది కాలవ్యవధిలో ఉంటుందని, తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో సబ్జెక్టులు ఉంటాయన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఈ నెల 30వ తేదీ లోపు సమర్పించాలన్నారు. రూ.200 అదనపు రుసుముతో ఆగస్టు 15 లోగా చెల్లించవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100, అడ్మిషన్ ఫీజు రూ.1300 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అర్హులైనవారు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ


సీడీ కండ్రిగ వద్ద ధ్వంసమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కార్వేటినగరం: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైన సంఘటన మండల పరిధిలోని సీడీ కండ్రిగ గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా... సీడీ కండ్రిగ గ్రామానికి చెందిన క్రిష్ణమండడి కుమారుడు వెంకటమునికి సర్వే నంబర్ 229/14లో ఉన్న వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిలో విద్యుత్ అధికారులు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అయితే శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి, అందులోని రాగి వైర్లను అపహరించుకు వెళ్లారు. పొలానికి వెళ్లిన రైతు ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైనట్లు గుర్తించి, విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి ఏడీఈ చంద్రబాబు, ఏఈ రామ్మూర్తి కలసి చేరుకుని చోరీ గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. అలాగే రైతు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు.

సంపన్నులు పేదలను దత్తత తీసుకోవాలి



మాట్లాడుతున్న కమిషనర్ మంజునాథ్‌గౌడ్, సమావేశానికి హాజరైన సచివాలయ కార్యదర్శులు

- పీ–4 ద్వారా ప్రభుత్వ ఆదేశాలు
- సహకరించండంటూ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి

పుత్తూరు: పట్టణంలోని సంపన్నులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, ఉద్యోగులు పేదరికంలో ఉన్న కుటుంబాలను దత్తత తీసుకొని వారిని సంపన్నులను చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.మంజునాథ్‌గౌడ్ కోరారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులకు పీ–4పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలను పేదరికం నుంచి బయట పడేందుకు పీ–4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్, పార్టనర్‌షిప్) అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. రాష్ట్రంలోని సంపన్నులు, విద్యావంతులు, ప్రజా సేవకులు అణగారిన కుటుంబాలను కనీసం ఒక్కో కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని కోరారు. దత్తత తీసుకొన్న పేద కుటుంబాలను ఉన్నత స్థితికి తీసుకురావడాకి కృషి చేయాలని కోరారు. కనీసం ఒక్కొక్కరు ఒక్కో కుటుంబాన్ని దత్తత తీసుకొని నిధుల సేకరణ, ఆర్థిక ప్రణాళిక, ఆరోగ్యం, వ్యవసాయం, బోధన, చట్టపరమైన విషయాల్లో మార్గదర్శకంగా నిలిచి సహాయ సహకారాలు అందించాలని కోరారు. తద్వారా అందరూ సంపన్నులవుతారని వెల్లడించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఎంపీడీఓ వాణి, ఎంఈఓ తిరుమలరాజు, మున్సిపల్ మేనేజర్ మణి శంకర్, ఏఎస్‌ఓ మునికృష్ణ పాల్గొన్నారు.

బండి దారి కబ్జా


బండిదారికి అడ్డంగా గోతులు తవ్విన స్థలంలో బాధితురాలు

శ్రీరంగరాజపురం: గ్రామస్తులు రాకపోకలు సాగించే బండిదారిని ఓ టీడీపీ నాయకుడు కబ్జా చేసిన సంఘటన మండలంలోని పి.వి.పురం గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలు నీలమ్మ కథనం మేరకు వెంకటాపురం రెవెన్యూ లెక్కదాఖల సర్వే నెంబర్ 282/11లో 0.38 సెంట్ల ప్రభుత్వ బండిదారి ఉంది. ఈ దారిలో గ్రామస్తులు రాకపోకలు సాగించే వారు. దీనిని ఓ టీడీపీ నాయకుడు ఆక్రమించుకుని కబ్జా చేశాడు. దీంతో నీలమ్మ గత ప్రభుత్వంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. కబ్జాకు గురైన స్థలాన్ని అప్పటి తహశీల్దార్ పరిశీలించి, ఈ స్థలం ప్రభుత్వం స్థలమని నిర్ధారించి, రహదారిని ఏర్పాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ నాయకుడు ఈ రహదారిని జేసీబీ సహాయంతో తవ్వించేశాడు. దీంతో నీలమ్మ కోర్టును ఆశ్రయించారు. శనివారం మరోసారి రోడ్డుకు అడ్డంగా గోతులు తవ్వించారు. దీనిపై నీలమ్మ పోలీసులు, రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదు చేయడంతో వారు భూకబ్జాను అడ్డుకున్నారు. వివాదం కోర్టులో ఉన్నందున భూమిలోకి ప్రవేశించకూడదని హెచ్చరించారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం


సర్వే చేస్తున్న ఎంపీడీఓ సతీష్, సత్యనారాయణ

పాలసముద్రం: పేదరిక నిర్మూలనలో భాగంగా బంగారు కుటుంబాలను తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎంపీడీఓ సతీష్ తెలిపారు. శనివారం బలిజకండ్రిగలో తమ సిబ్బందితో కలసి ఇంటింటికి తిరిగి సర్వే చేపట్టారు. ఆయన బ్యాంకు ఖాతా నెంబర్, గ్యాస్ కనెక్షన్, విద్యుత్ మీటర్, మోటారు వాహనాలు లేని కుటుంబాలను గుర్తించాలని సూచించారు. ఇలాంటి కుటుంబాలను గుర్తించి ఉన్నతాధికారుల జాబితా పంపించాలని తెలిపారు. వీరికి ఎన్‌ఆర్‌ఐలు ఆర్థిక సహాయం అందించే విధంగా చేస్తారు. వారు అందించే ఆర్థిక సహాయంతో ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సుధ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ సైనికుడికి సన్మానం


సుబేదార్ హరికృష్ణారెడ్డిని సన్మానిస్తున్న జిల్లా సైనిక సంక్షేమ అధికారి రాఘవులు

గంగాధరనెల్లూరు: కార్గిల్‌లో దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన అమరులకు చిత్తూరులోని అమరవీరుల స్థూపం వద్ద శనివారం కార్గిల్ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న గంగాధరనెల్లూరు మండలం ఎల్లమ్మరాజుపల్లి గ్రామానికి హానరరీ నాయబ్ సుబేదార్ హరికృష్ణారెడ్డిని జిల్లా సైనిక సంక్షేమ అధికారి రాఘవులు పూలమాల వేసి శాలువాలతో సత్కరించారు. జ్ఞాపిక అందించి సన్మానించారు. అనంతరం హరికృష్ణారెడ్డిని జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు అట్లూరి శ్రీనివాస్ తదితరులు సన్మానించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

తవణంపల్లె: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ప్రియాంక అన్నారు. శనివారం మండలంలోని ద్వారకాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 45 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. డాక్టర్ మాట్లాడుతూ జీవన శైలి విధానంలో చోటు చేసుకున్న మార్పులతో అత్యధికంగా రక్తపోటు సంక్రమిస్తోందని, ప్రతి ఒక్కరూ శరీర వ్యాయామం అలవర్చుకోవాలని సూచించారు. ఆకుకూరలు, కాయగూరలు తీసుకోవాలన్నారు.